# రూ.59కే ఫోన్‌పే ఆరోగ్య బీమా




న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ప్రముఖ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే.. సరికొత్త ఆరోగ్య బీమా ప్లాన్‌ను పరిచయం చేసింది. కేవలం రూ.59కే ఏడాదిపాటు డెంగీ, మలేరియా, చికున్ గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర 10కిపైగా అనారోగ్య సమస్యలు, వ్యాధులకు రూ.5వేలదాకా ఇన్సూరెన్స్ కవరేజీనిస్తున్నది. అలాగే రూ.99కి రూ.10వేలు, రూ.199కి రూ.25 వేలు, రూ.299కి రూ.50వేలు, రూ.499కి లక్ష రూపాయల వరకు బీమా కవరేజీని పొందవచ్చు. ఈ ప్లాన్ల ద్వారా పరిమితిలోపు దవాఖాన సదుపాయం, వైద్య పరీక్షలు, ఐసీయూ/రూమ్ అద్దె ఖర్చులను పాలసీదారులు క్లెయిం చేసుకోవచ్చు. ప్రధానంగా దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో నివారే లక్ష్యంగా ఈ బీమాను తీసుకొచ్చామని ఫోన్‌పే చెప్తున్నది. ఉద్యోగులు సైతం తమ కంపెనీలు అందిస్తున్న గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు దీన్నో సప్లిమెంటరీగా వాడుకోవచ్చంటున్నది. చౌకగా ఆరోగ్య బీమాను పొందలేకపోతున్నవారికి ఈ ప్లాన్లు ఉపయుక్తంగా ఉంటాయని ఫోన్‌పే ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ సీఈవో విశాల్ గుప్తా అంటున్నారు. యూజర్లు తమ ఫోన్‌పే యాప్ ద్వారానే ఈ ప్లాన్‌ను కొని ఉపయోగించుకోవచ్చు. అలాగే క్లెయిం ఫైలింగ్ చేసుకోవచ్చు.

- ఫోన్‌పే యూజర్లు తొలుత తమ ఫోన్‌పే యాప్‌లో ఇన్సూరెన్స్ సెక్షన్‌లోని 'వ్యూ ఆల్'పై క్లిక్ చేయాలి.
- కింద అదర్ ఇన్సూరెన్సెస్‌లో డెంగీ అండ్ మలేరియా ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఆ తర్వాత అక్కడ కనిపించే ప్లాన్లలో మీకు నచ్చినదాన్ని సెలెక్ట్ చేసుకొని కంటిన్యూపై క్లిక్ చేయాలి.
- కొత్తగా వచ్చే పేజీలో మీ పేరు, ఈ-మెయిల్ ఐడీ, పుట్టిన తేదీ తదితర వివరాలను టైప్ చేయాలి.
- చివరగా నిబంధనలకు లోబడి ఉంటామన్నదానిపై టిక్ చేసి, పేమెంట్ చేస్తే పాలసీ కవరేజీ మొదలైపోతుంది.

# స్కోడా కైలాక్ మాడల్

### గరిష్ఠ ధర రూ.14.40 లక్షలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: చెక్‌రిపబ్లిక్ వాహన సంస్థ స్కోడా..భారత్‌లో పాగవేయడానికి పావులుకదుపుతున్నది. ఇప్పటికే పలు మాడళ్లను విడుదల చేసిన సంస్థ..తాజాగా మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశీయంగా అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి ఈ సరికొత్త మాడల్‌ను పరిచయం చేసినట్లు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్ర్ జనేబా తెలిపారు. రెండు రకాల్లో లభించనున్న ఈ కైలాఖ్ మాడల్ రూ.7.89 లక్షల నుంచి రూ.14.40 లక్షల ధరల శ్రేణిల్లో లభించనున్నదన్నారు. ఈ నూతన మాడల్‌తో వచ్చే ఏడాది 80 వేల యూనిట్ల వాహనాలను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. తొలి 33,333 కస్టమర్లకు కాంప్లిమెంటరీ కింద మూడేండ్లపాటు స్టాండర్డ్ మేంటనెన్స్ ప్యాకేజీ అందిస్తున్నది. ఇప్పటికే బుకింగ్‌లు ఆరంభించిన సంస్థ..వచ్చే నెల చివరి నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది.




# ₹ రూపాయి గింగిరాలు



### మరో ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనం • 12 పైసలు దిగజారి 84.72 వద్దకు క్షీణత

ముంబై, డిసెంబర్ 2: ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి గింగిరాలు తిరుగుతున్నది. డాలర్ ముందు ఏమాత్రం నిలువలేక భారతీయ కరెన్సీ అంతకంతకూ చతికిలపడిపోతున్నది మరి. సోమవారం మరో 12 పైసలు క్షీణించి మునుపెన్నడూ లేనివిధంగా 84.72 వద్దకు పతనమైంది. అంతర్జాతీయంగా అమెరికా కరెన్సీ డాలర్‌కు డిమాండ్ పెరిగి బలపడటం, దేశీయంగా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న సంకేతాలు జీడీపీ గణాంకాలతో రావడం దెబ్బతీసింది. నిజానికి ఉదయం ఆరంభంలో రూపాయి పెరుగుతున్నట్టు కనిపించినా.. ఆఖరుకు నిరాశే మిగిలింది.

#### ట్రంప్ సెగ..

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచి కరెన్సీ మార్కెట్‌లో డాలర్ పరుగులు మొదలయ్యాయి. ఇదే సమయంలో ఇతర దేశాల కరెన్సీల పతనం కూడా ఆరంభమైంది. ముఖ్యంగా ఆసియా దేశాల్లోని అన్ని కరెన్సీల విలువ క్రమేణా పడిపోతున్నదని ఫారెక్స్ ట్రేడర్లు గుర్తుచేస్తున్నారు. ఇక బ్రిక్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా) దేశాల కరెన్సీలూ తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయని చెప్తున్నారు. బ్రిక్ సభ్య దేశాలపై 100 శాతం సుంకాల పెంపు ఉంటుందని ట్రంప్ హెచ్చరించడమే కారణం.

#### 4 రోజుల్లో..

వరుసగా గత 4 రోజుల్లో జరిగిన ట్రేడింగ్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఏకంగా 43 పైసలు కోల్పోవడం గమనార్హం. శుక్రవారం 13 పైసలు పడిపోగా, అంతకుముందు రెండు రోజులు 7 పైసలు, 11 పైసలు చొప్పున నష్టపోయింది. దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ఫారెక్స్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. దాదాపు గత రెండు నెలల్లో దేశంలోని ఫారెక్స్ నిల్వలు సుమారు 50 బిలియన్ డాలర్ల మేర హరించుకుపోయాయి.

#### ప్రమాద ఘంటికలు

ఓవైపు దేశ జీడీపీ పతనం.. మరోవైపు రూపాయి విలువ క్షీణత.. ఇంకోవైపు పెట్టుబడుల ఉపసంహరణలు.. కలిసి ప్రమాద ఘంటికల్నే మోగిస్తున్నాయి. నానాటికీ పడిపోతున్న రూపాయి విలువ.. దేశీయ దిగుమతుల్ని భారం చేస్తుండగా.. ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నది. ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లో ఉంచుతున్నది. ఇప్పుడు రూపీ తీరు.. ఇకపైనా వడ్డీరేట్ల కోతలకు వీల్లేకుండా చేస్తున్నది. ఇదే జరిగితే కీలక రంగాల్లో వృద్ధి పడిపోవడం ఖాయం.

## వ్యవసాయ వర్సిటీలో ఎస్బీఐ ఏఐ ల్యాబ్!



హైదరాబాద్, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) చైర్మన్ శ్రీనివాసులు శెట్టి సుముఖత వ్యక్తం చేసినట్టు యూనివర్సిటీ వీసీ జానయ్య తెలిపారు. సోమవారం ముంబైలో చైర్మన్ శ్రీనివాసులుతో వీసీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏఐ ల్యాబ్ ఏర్పాటునకు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని ఆయన కోరగా, దీనికి చైర్మన్ సుముఖత వ్యక్తం చేసినట్టుగా తెలిపారు. ఈ నెల 20, 21న జరిగే యూనివర్సిటీ వజ్రోత్సవాలకు చైర్మన్‌ను ఆహ్వానించారు. శెట్టి వ్యవసాయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కావడం గమనార్హం.

# పెరగనున్న సిగరెట్లు, పొగాకు ధరలు!

### 21న జీఎస్టీ కౌన్సిల్ భేటీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులతోపాటు శీతలపానియాల ధరల మరింత పెరగబోతున్నాయి. జీఎస్టీ పన్ను రేటు హేతుబద్ధీకరణలో భాగంగా ప్రస్తుతం వీటిపై విధిస్తున్న 28 శాతం జీఎస్టీని 35 శాతానికి పెంచాలని బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరీ అధ్యక్షతన సోమవారం జీవోఎం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. జీవోఎం నిర్ణయానికి అనుగుణంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ ఈ నెల 21న సమావేశమైన తుది నిర్ణయం తీసుకోనున్నది. వీటితోపాటు దుస్తులపై పన్నును సవరించింది. రూ.1,500 లోపు రెడీమేడ్ గార్మెంట్లపై 5 శాతం పన్ను విధించనుండగా, అలాగే రూ.1,500 నుంచి రూ.10 వేల లోపు రెడీమేడ్ గార్మెంట్లపై 18 శాతం, రూ.10 వేలకు పైబడి గార్మెంట్లపై 28 శాతం విధించాలని జీవోఎం సూచించింది. కొత్తగా 148 ఉత్పత్తులపై పన్ను విధించాలని జీవోఎం సూచించగా, దీనిపై జీఎస్టీ నిర్ణయం తీసుకోనున్నది.

#### కొత్తగా 35 శాతం

ప్రస్తుతం జీఎస్టీ పన్నుల్లో నాలుగు స్లాబ్‌లు ఉండగా, కొత్తగా 35 శాతం రేటును కూడా చేర్చాలని జీవోఎం సూచించింది. కొత్త స్లాబ్‌లో పొగాకు, ఇందకు సంబంధించిన ఉత్పత్తులతోపాటు శీతలపానియాలు చేర్చాలని పేర్కొంది. ప్రస్తుతం 5, 12, 18,28 శాతం రేట్లలో పన్నులు విధిస్తున్నది. లగ్జరీ ఉత్పత్తులైన కార్లు, వాషింగ్ మెషిన్లు, పొగాకు ఉత్పత్తులు 28 శాతం స్లాబ్‌లో ఉన్నాయి.

## 80 వేల పైకి సెన్సెక్స్

ముంబై, డిసెంబర్ 2: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. మధ్యాహ్నం వరకు నష్టాల్లో ట్రేడైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో రివ్వున ఎగిశాయి. 79,308.95-80,337.82 పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 445.29 పాయింట్లు అందుకొని 80,248.08 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ సైతం 144.95 పాయింట్లు అందుకొని 24,276.05 వద్ద ముగిసింది.

ఏడాది కిందటి వరకు.. తెలంగాణ అంటే పెట్టుబడుల గమ్యస్థానం. ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలతో పారిశ్రామికవేత్తలను ఆకర్షించిన రాష్ట్రం. పదేండ్లలోనే రూ. 2.66లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి, దాదాపు 18లక్షల ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం. కానీ.. ఏడాదిలోనే సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాల ఫలితంగా కొత్త కంపెనీలు రాకపోగా.. గతంలో వచ్చిన పెట్టుబడులు సైతం పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి. పరిశ్రమలకు లో ఓల్టేజీ, కరంటు కోతలు మొదలయ్యాయి. వరుస వివాదాలు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశాయి. – హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)




# పరిశ్రమలు వెనుకడుగు

| పదేండ్లపాటు పారిశ్రామిక రంగం పరుగులు | కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏడాదిగా స్తబ్ధత | ఒప్పందాలకే పరిమితమైన పెట్టుబడులు | ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్న పరిశ్రమలు | బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీసిన వివాదాలు |
|---|---|---|---|---|

- **పరిశ్రమలు వెనక్కి.. ఫార్మా.. ఆగమాగం**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంవత్సర కాలంలో ఒక్క భారీ పరిశ్రమ కూడా రాలేదు. పైగా రెండు భారీ పరిశ్రమలు వెనక్కు తరలివెళ్లాయి. గొరిల్లా గ్లాస్ తయారీ కంపెనీ కార్నింగ్ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టేందుకు బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. కంపెనీ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఇప్పుడు చెన్నైకి తరలివెళ్లింది.

సెమీ కండక్టర్ల తయారీ దిగ్గజం కేన్స్ సెమికాన్ కంపెనీది ఇదే పరిస్థితి. రాష్ట్రంలో రూ.2,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. కానీ.. ఇప్పుడు గుజరాత్ బాట పట్టింది. అనేక చిన్న కంపెనీలు తమ యూనిట్లను మూసివేసేందుకు సిద్ధం అవుతున్నాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఫార్మా రంగం అగమ్యగోచరంగా తయారైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ముచ్చర్లలో దాదాపు 14వేల ఎకరాలతో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో కంపెనీల విస్తరణ ప్రణాళికలు వాయిదా పడ్డాయి.

కొన్ని కంపెనీలు ఏపీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. దీంతో ఫార్మా క్లస్టర్లు, ఫార్మా విలేజీలను తెరమీదికి తెచ్చారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో భూసేకరణకు ప్రయత్నిస్తే జరిగిన పరిణామాలు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. దీంతో ఫార్మా కంపెనీలు తెలంగాణ అంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి తలెత్తింది.




### బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్

*బీఆర్ఎస్ హయాంలో దేశ, విదేశాల్లో తెలంగాణకు కల్పించిన ప్రచారంతో బ్రాండ్ ఇమేజ్ పెరిగింది. కానీ ఏడాదిగా జరుగుతున్న పరిణామాలు ఈ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్నాయి.*

ఫార్మాసిటీ రద్దుతో మొదలవగా.. ఫార్మా క్లస్టర్ల పేరుతో లగచర్లలో జరిగిన హింసాత్మక ఘటనలతో వ్యాపారవేత్తలు ఆలోచనలో పడ్డారు.

సీఎం అమెరికా పర్యటన సందర్భంగా సొంత తమ్ముడికి చెందిన స్వచ్ఛ్ బయోగ్రీన్‌తో ఒప్పందం మరింత పరువు తీసింది.

### 40,232 కోట్ల ఒప్పందాలు


ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య వేదిక వార్షిక సదస్సు సందర్భంగా రూ.40,232 కోట్లు పెట్టుబడి ఒప్పందాలు జరిగినట్టు ప్రభుత్వం ఘనంగా ప్రకటించుకున్నది.

### 1 ఒక్క కంపెనీ తెలంగాణకు రాలేదు

ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా రూ.36వేల కోట్లకు ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు చెప్పుకున్నారు. కానీ ఈ రూ.76వేల కోట్లలో ఒక్క కంపెనీ కూడా కాగితాలను దాటలేదు.

### 10% హైదరాబాద్‌లో కంపెనీల నమోదు డౌన్

2023 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చుకుంటే 2024 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో కంపెనీల నమోదు 10 శాతం తగ్గినట్టు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. కంపెనీల నమోదు ఐదేండ్ల కనిష్టస్థాయికి పడిపోయినట్లు స్పష్టం చేసింది.




పదేండ్లలో పారిశ్రామిక వృద్ధి..

వెనక్కిపోయిన పరిశ్రమలు
1. కంపెనీ: కార్నింగ్ — పెట్టుబడి: 1000 కోట్లు
2. కంపెనీ: కేన్స్ సెమికాన్ — పెట్టుబడి: 2800 కోట్లు

| దావోస్‌లో జరిగిన ఒప్పందాల విలువ | వచ్చిన పెట్టుబడులు / ఇచ్చిన ఉద్యోగాలు | అమెరికాలో చేసుకున్న ఒప్పందాల విలువ |
|---|---|---|
| రూ.40,232 కోట్లు | 0 | రూ.36,002 కోట్లు |

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

**సవరణ - 3 తేది: 27-11-2024**
**టెండరు ప్రకటన నం. B-SG-GS-KAVACH-02-24-25**
**తేది: 12-09-2024**
PUB/1194

పైన తెలిపిన టెండర్‌కు మార్పులు దిగువ ఇవ్వబడినవి.

| క్ర.సం. | ఈవెంట్ వివరణ | ప్రస్తుతమున్నది | సవరించబడిన విధంగా |
|---|---|---|---|
| 1. | టెండరు ముగింపు తేది, సమయం | 12/12/2024 15:00 గం. | 27/12/2024 15:00 గం. |
| 2. | బిడ్డింగ్ ప్రారంభ తేది | 28/11/2024 | 13/12/2024 |

A1528 డిప్యూటి చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజినీర్/గతిశక్తి/విజయవాడ

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

**ప్రొఫార్మా 10-1**
**బహిరంగ ప్రకటన**
PUB/1195

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్ పైగల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:
**సెక్షన్: సికింద్రాబాద్ డివిజన్:** కాజీపేట్ -విజయవాడ సెక్షన్ మధ్య కొత్త BG మూడవ లైన్ నిర్మాణం- ప్రయాణీకుల పబ్లిక్ రవాణా కొరకు కి.మీ. 524.240 నుండి కి.మీ. 528.598 వరకు మోటుమర్రి (MTMI) నుండి మధిర (MDR) స్టేషన్ల మధ్య కొత్త BG మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.
దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల పబ్లిక్ రవాణా కి.మీ. 524.240 నుండి కి.మీ. 528.598 వరకు మోటుమర్రి (MTMI) నుండి మధిర (MDR) స్టేషన్ల వరకు Loc. 523/41 (km/Ch: 523/930.80) నుండి Loc. 528/C20 (km/Ch: 528/ 878.50) వరకు 25000 ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: **30-12-2024**న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్టుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

**ప్రొఫార్మా 10-2**
**(ACTM Para 21020, Vol II, Part I : Correction Slip No. 32, Dated 09-10-2020)**
**ac 25kV ట్రాక్షన్ ప్రారంభం**
**"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"**

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:
**సెక్షన్: సికింద్రాబాద్ డివిజన్:** కాజీపేట్ -విజయవాడ సెక్షన్ మధ్య కొత్త BG మూడవ లైన్ నిర్మాణం-ప్రయాణీకుల పబ్లిక్ రవాణా కొరకు కి.మీ. 524.240 నుండి కి.మీ. 528.598 వరకు మోటుమర్రి (MTMI) నుండి మధిర (MDR) స్టేషన్ల మధ్య కొత్త BG మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.
దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు కి.మీ. 524.240 నుండి కి.మీ. 528.598 వరకు మోటుమర్రి (MTMI) నుండి మధిర (MDR) స్టేషన్ల వరకు Loc. 523/41 (km/Ch: 523/930.80) నుండి Loc. 528/C20 (km/Ch: 528/878.50) వరకు లైవ్ ట్రాక్షన్ వైర్ ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్ళు వాహనములను నివారించు నిమిత్తం **రోడ్ లెవల్‌కు ఎగువన 4.78m స్పష్టమైన గరిష్ఠ ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైట్‌గేజ్‌లు స్థాపించబడినవి.**
లోడ్‌తో వెళ్ల వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తుని గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములందు తీసుకెళ్ళు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించరాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.
అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్ల వాహనములకు సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి:
i) హైట్‌గేజ్‌కు ప్రమాదం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది.
ii) వాహనములపై తీసుకెళ్ళ సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చును.
iii) కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్ల కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చును మరియు ప్రాణాంతకం కావచ్చును.

A1529 డిప్యూటి చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్/ సికింద్రాబాద్


## జర్మనీలో ఉద్యోగాలు

### ఆటోమోటివ్ టెక్నీషియన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): జర్మనీలో ఆటోమోటివ్ టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) దరఖాస్తులు ఆహ్వానించింది. అభ్యర్థులకు కార్లు, కమర్షియల్ వాహనాల మెకానిజంపై 3-5 ఏండ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. మెకాట్రానిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేక డిప్లొమాను అదనపు అర్హతగా పరిగణిస్తారు. వయసు 20-40 ఏండ్ల మధ్య ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు టామ్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా లేక మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## నటి శోభితది ఆత్మహత్యే

శేరిలింగంపల్లి/సుల్తాన్‌బజార్, డిసెంబర్ 2 : అనుమానాస్పదంగా మృతిచెందిన కన్నడ బుల్లితెర నటి శోభితాశివన్నది ఆత్మహత్యే అని పోలీసులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా శోభిత ఆత్మహత్యకు పాల్పడినట్టు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. కొండాపూర్ శ్రీరాంనగర్‌కాలనీలోని తన నివాసంలో మృతిచెందిన శోభిత శరీరంపై ఎలాంటి గాయాలు లేవని తేలిందని, పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు వెల్లడించారు. కుటుంబసభ్యులు సైతం ఆమె మృతిపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని, భర్త సుధీర్‌రెడ్డితో సైతం ఆమెకు విభేదాలు లేనట్టు తెలిసిందని వెల్లడించారు. శోభిత మృతదేహానికి సోమవారం ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ వైద్యుడు యాదయ్య నేతృత్వంలో శవ పరీక్షలు చేసి అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేయగా స్వస్థలం బెంగళూరుకు తీసుకెళ్లారు.



## 8న కేఆర్ఎంబీ మీటింగ్

హైదరాబాద్, డిసెంబర్2 (నమస్తే తెలంగాణ): 19వ బోర్డు మీటింగ్‌ను 8వతేదీన నిర్వహించనున్నట్టు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) వెల్లడించింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు తాజాగా సమాచారం అందించింది. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు సంబంధించిన ఆపరేషన్ రూల్‌కర్వ్, జలవిద్యుత్తు ఉత్పత్తి తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

# బయటి వ్యక్తుల చేతుల్లో బందీగా టీజీ-ఐపాస్

- 'ప్రత్యేక' చానల్ ద్వారానే పరిశ్రమలకు భూములు
- దరఖాస్తులన్నీ బుట్టదాఖలే

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన భూములను కేటాయించడంతోపాటు అన్ని రకాల అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో మంజూరు చేసేందుకు ఉద్దేశించిన తెలంగాణ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ (టీజీ-ఐపాస్) వ్యవస్థ కొందరు అధికారులు, బయట వ్యక్తుల చేతిలో బందీగా మారిపోయింది. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఎవ్వరినీ యాచించే అవసరం లేకుండా అర్హతలకు అనుగుణంగా భూములు కేటాయించిన ఈ విధానం.. ఇప్పుడు కొందరు వ్యక్తుల కనుసన్నల్లో పనిచేసే 'ప్రత్యేక' చానల్ ద్వారా వెళ్తేనే స్పందిస్తున్నది. వారు ఓకే అంటేనే అనుమతులు జారీ అవుతున్నట్టు టీజీఐఐసీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిశ్రమలకు ఆన్‌లైన్‌లో అనుమతులు జారీచేసే విధానం నిలిచిపోయింది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు బుట్టదాఖలవుతున్నాయి. ప్రస్తుతం టీజీఐఐసీలో ప్రభుత్వం నియమించిన ఒకరిద్దరు అధికారులు, మరి కొందరు బయటి వ్యక్తుల ప్రమేయంతోనే అనుమతులు జారీ అవుతున్నట్టు తెలుస్తున్నది. వారిని సంప్రదించకుండా ఆన్‌లైన్‌లో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని, ఆ దరఖాస్తులన్నీ బుట్టదాఖలవుతున్నాయని వినికిడి. ఏడాది క్రితం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క కొత్త పారిశ్రామికవాడను ఏర్పాటు చేయకపోగా గతంలో అభివృద్ధి చేసిన ఇండస్ట్రియల్ పార్కుల్లో ఇష్టారాజ్యంగా భూములను కేటాయిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. నల్లగొండ, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట, వరంగల్, సంగారెడ్డి తదితర జిల్లాల పరిధిలో తమకు తెలియకుండా ఏ పరిశ్రమకూ భూములు కేటాయించవద్దని అధికారులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు హుకుం జారీచేసినట్టు తెలిసింది. గతంలో కేటాయించిన భూముల్లో ఇప్పుడు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వస్తున్నవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు సమాచారం.

#### భూ కేటాయింపులో పారదర్శకత శూన్యం

పారదర్శకంగా భూసేకరణ నిర్వహించడం, ఎవరికీ ఇబ్బంది తలెత్తకుండా ఇండస్ట్రియల్ పార్క్‌లను అభివృద్ధి చేయడం ద్వారా గత ప్రభుత్వం భారీగా పెట్టుబడులు సాధించింది. కానీ, ఇప్పుడు వికారాబాద్ జిల్లాలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలనుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుండడం గమనార్హం. ఫార్మాసిటీలో భూముల కోసం ఎన్నో కంపెనీలు ఇదివరకే దరఖాస్తు చేసుకున్నాయి. ఆ కంపెనీలకు భూములను కేటాయించకుండా రాష్ట్రవ్యాప్తంగా 10 ఫార్మా విలేజ్‌లను నెలకొల్పుతామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు బలవంతంగా సేకరించాలని చూస్తున్న భూములు ఎవరికోసమో అంతుబట్టడంలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన మేడ్చల్ సిద్దిపేట ఇండస్ట్రియల్ జోన్, వర్గల్, ములుగు, కర్కపట్ల, బండ మైలారం, కర్కపట్ల, తునికిబొల్లారం, బండ తిమ్మాపూర్, మాదారం, కొండాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు-పాశమైలారం, ఇంద్రకరన్, రంగారెడ్డి-కొత్తూర్, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, రాకంచెర్ల, సుల్తాన్‌పూర్, ఖమ్మం- బుగ్గపాడు, వరంగల్-మడికొండ, టెక్స్‌టైల్ పార్క్, యాదాద్రి-వెలిమినేడు, దండుమల్కాపూర్ తదితర ఇండస్ట్రియల్ పార్కుల్లో ప్రస్తుతం మిగిలివున్న భూముల కేటాయింపులో కొందరు అధికారులు, బయటి వ్యక్తులు చక్రం తిప్పుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

#### నాడు సాఫీగా కేటాయింపులు

గతంలో పరిశ్రమల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1.5 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏండ్లలో వివిధ కంపెనీలకు 28,458 ఎకరాలు కేటాయించింది. టీజీఐఐసీ ద్వారా దాదాపు 21,921 యూనిట్లకు అనుమతులు జారీచేయడంతో రూ.2.66 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

### వైభవంగా లక్ష్మీ కాసులహారం
## శోభయాత్ర


### పద్మావతి అమ్మవారికి అలంకరణ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి లక్ష్మీ కాసుల హారం శోభయాత్ర సోమవారం తిరుచానూరులో వైభవంగా జరిగింది. ముందుగా శ్రీవారి ఆలయం నుంచి అదనపు ఈవో వెంకయ్యాచౌదరి లక్ష్మీ కాసులహారాన్ని తిరుచానూరులోని శిల్పారామం పసుపు మండపం వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి ఆభరణాల్లో లక్ష్మీ కాసులహారం ప్రధానమైందని, పౌర్ణమి గరుడ సేవ సందర్భంగా ఈ హారాన్ని స్వామివారికి అలంకరించనున్నట్టు తెలిపారు. గజ, గరుడవాహన సేవల సందర్భంగా పద్మావతి అమ్మవారికి ఈ హారాన్ని అలంకరించడం ఆనవాయితీగా వస్తున్నదని వెల్లడించారు.

## నేడు నికేశ్ బినామీల లాకర్లు తెరుస్తం

- నవంబర్‌లో 17 ట్రాప్‌లు, 1 అక్రమాస్తుల కేసు: ఏసీబీ డీజీ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద కేసుగా పరిగణిస్తున్న హేరూర్ నికేశ్‌కుమార్ ఆస్తులపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నికేశ్‌కుమార్ బినామీల బ్యాంకు లాకర్లను మంగళవారం తెరుస్తారని సమాచారం. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఏసీబీ.. నికేశ్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను కూడా విచారించి, అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. ఏసీబీ నవంబర్‌లో 17 ట్రాప్‌లతో పాటు ఆదాయానికి మించిన ఓ కేసును నమోదు చేసింది. 17 ట్రాప్‌లలో 27 ప్రభుత్వ ఉద్యోగులు, ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచాల కోసం వేధిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని, ఎక్స్‌లో (twitter @TelanganaACB), ఫేస్‌బుక్‌లో (@telanganaacb) ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.



## డ్రగ్స్ నియంత్రణకు సంయుక్త కమిటీ

### తెలంగాణ, ఏపీ సీఎస్‌ల భేటీలో నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ నియంత్రణకు ఏపీ, తెలంగాణ పోలీస్, ఎక్సైజ్ శాఖలతో సంయుక్తంగా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణ సీఎస్ శాంతికుమారి బృందం సోమవారం ఏపీకి వెళ్లింది. మంగళగిరిలో ఏపీ సీఎస్ నీరబ్ కుమార్‌తో సమావేశమయ్యారు. రూ.861 కోట్ల మేర లేబర్ సెస్‌ను ఏపీ, తెలంగాణ మధ్య పంపకానికి ఒప్పుకున్నారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి అధికంగా చెల్లించిన రూ.81 కోట్లను తెలంగాణకు తిరిగి ఇచ్చేందుకు ఏపీ అంగీకరించింది.

## రేపే 'డీట్' ప్రారంభం

### కంపెనీలకు, నిరుద్యోగులకు మధ్య వారధి

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డీట్)ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. వివిధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలు, అప్రెంటీస్‌షిప్, ఇంటర్న్‌షిప్‌ల వివరాలను ఈ వెబ్ పోర్టల్‌లో ఉంచుతారు. నిరుద్యోగులతోపాటు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు ఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో నమోదైన అభ్యర్థులకు కంపెనీలు తమ అవసరాలకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. అభ్యర్థులకు కంపెనీలే నేరుగా మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ పంపడంతోపాటు కాల్‌చేసి పిలుస్తాయి. 'డీట్' అనేది కంపెనీలకు, ఉద్యోగార్థులకు మధ్య వారధి లాంటిదని, ఇందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు.